"పూర్తి" అనేది ఎన్నటికీ కావాలని విషయం అజీజ్" అన్నాడు రవి, తను హైదరాబాద్‌లో తాత్కాలికంగా ఏర్పరచుకున్న కిరాయి ఇంట్లోని స్టూడియోలో ఈజిల్‌వద్ద నిలబడి ఏదో ఛార్‌కోల్‌స్కెచ్ వేస్తూ.

'''అయినా నాకు దృఢవిశ్వాసముంది" అంది, అక్కడే స్టూల్‌పై కూర్చున్న అజీజ్, అతను వేసే స్కెచ్‌ని తదేకదీక్షతో తిలకిస్తూ, ఎంత చూచినా అర్థంకాని దృష్టితో.

"గట్టిగా విశ్వసించడమంటేనే ఏదో అ[illegible]శ్వాసముందని అర్థం" అన్నాడు రవి.

"నేను కళాకారులతో మాట్లాడగలనేమో కాని తార్కికులతో మాట్లాడ లేను. అయినా అదంతా నాకెందుకు? నేనొచ్చిన పని ఏమంటారో చెప్పండి'' అంది, వెళ్ళే ఉద్దేశ్యం వ్యక్తపరిచేటందుకై ఓమారు పైట సర్దుకుంటూ.

"[illegible] అద్భుతం కాదేమో [illegible]" అన్నాడు రవి, వేసే స్కెచ్ ముగించి, [illegible] కుర్చీలో కూర్చుని సిగ[illegible] వెలిగించి, వెలిగిపోతున్న అష్ట్రేలో [illegible].

"సుల[illegible] అంటూ" అంది అజీజ్, [illegible] పొగను గమనిస్తూ.



# మూసిన తలుపులు

## ఎమ్.ఆర్.కొండల్ రెడ్డి

*మనుషులు మనుషులుగానే ఉండా అని కోరుకోనరు. దేవతలు కావాలని కోరుకొంటారు. చివరికి మానవత్వం కూడా లోపిస్తుంది. ప్రపంచమే అంత అని సరిపెట్టుకోవచ్చు, మరి!*

"సులభంగా కనిపించే ప్రతిపని వెనుకా మనకు కనిపించనికష్టం ఇమిడి ఉంటుంది" అన్నాడు రవి, సిగరెట్టు దమ్ము గట్టిగా పీల్చుతూ, అంత తీక్ష్ణంగా అజీజ్‌ను చూస్తూ.

"ఈ తత్వమంతా నాకెందుకు బోధిస్తారు? అసలు మీకు ఓరియంటల్ ఆర్ట్సు అంటే ఇష్టం లేదనండి. ఏమండి రవిగారూ, పురాతన కళ కళకాదా? అందులో మనం ఇంకా కృషిచేయ కూడదా?" అంది అజీజ్, వాదనకు సిద్ధమైన దానిలా.

"నేను పురాతన కళని కళగాదనను. కాని, మనం ఆకళలో కృషిచేయవలసినదేమీ మిగల్చ లేదు మన పురాతనులు. ఓరియంటల్‌స్టైల్ చేయనని కాదు. కానీ, నీవన్నట్లు మీ మహిళా సమాజం ఏర్పాటుచేసే ప్రదర్శనానికనిమాత్రం చేయను. అయినా ఈ కిరాయి స్టూడియోలో అది అయేపనికాదనుకుంటాను" అంటూ తన గదిని నలుమూలలా పరీక్షించాడు రవి.

"అలా ఐతే మా ఇంట్లో నాస్టూడియోలో చేయండి" అంది అజీజ్ ఆదుర్దాగా.

"ఈమాట ఆలోచించే అన్నావా?" అన్నాడు రవి, చేతిలోని సిగరెట్‌ను ఆష్‌ట్రేలో వేస్తూ,

"మాటకు ముందు ఆలోచించవలసిన అవ సరం నాకు లేదు" అంది అజీజ్ కొంటెగా.

"ఇకముందు అలవర్చుకోవడం మంచిది" అన్నాడు రవి.

"అలా గాభరాపడతా రెందుకు? నా స్టూడియోలో చేస్తే మావారు ఏమైనా అనుకుంటా రనా? మావారంత అనాగరకులేమీగారు. వారు చిత్రకారిణి భర్త" అంది అజీజ్ ఆఖరిమాటను గట్టిగా నొక్కి పలుకుతూ.

"నే నెప్పుడు కాదన్నాను?" అన్నాడు ముక్త సరిగా రవి.

"అయితే, ఎప్పుడొస్తారు మా ఇంటికి?" అంది అజీజ్ లేచి నిలబడుతూ.

"నా అంతట వస్తే రమ్మంటావా, లేక నీ వెంట తీసుకెళ్తావా?" అన్నాడు రవి, అజీజ్ భుజాలమంచి నేలమీదికి ఆనుకుని ఉన్న పమిట కొంగు పైని చేనేత పనితనాన్ని చూస్తూ.

"మీతో మాట్లాడలేను. కాని నా వెంట తీసుకెళ్లగలను. లేవండి" అని లేపింది.

* * * *

రవి కేవలం కళాకారుడే కాదు, శిల్ప కళలో చాలా ప్రయోగాలు చేశాడు. ముఖ్యంగా 'ఆబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్స'లో అద్వితీయమైన కృషి సల్పాడు. తన కళాజీవితంలో సగం దానికే ధారవోశాడు. ఆధునిక శిల్పకళలో ఆతడు ప్రవేశపెట్టిన కొత్త పోకడలకు అఖిల భారత ఆధునిక కళా సమితివారు ప్రశంసించి ప్రత్యేక బహుమతి ఇచ్చారు. రవి శిల్పాలకు ఇతర దేశాలలో కూడా చాలా బహుమతులు లభించాయి. హైదరాబాదులోని అజంతా మంటపంలో రవిప్రత్యేక కళాప్రదర్శనం జయప్రదంగా ముగిసి దాదాపు నెలరోజులవుతున్నది. ప్రదర్శన కాలంలో రవికి రకరకాల కళాకారుల, కళాభిమానుల, కళాపోషకులతో పరిచయం ఏర్పడింది. అలా ఏర్పడిన పరిచయస్థులలో రవి వల్ల బాగా ఆకర్షించబడింది అజీజ్.

రవి మొట్టమొదటిసారి అజీజ్‌ను అజంతా మంటపంలో చూచినప్పుడు, ఆమె కళ్ళు, అతని కళ్లు కలుసుకున్నప్పుడు, ఆమె అందాన్నంతా అతని చూపులు పీల్చేస్తున్నట్లు అనిపించింది. అలాగే అజీజ్‌ను కూడా, అతన్ని చూస్తున్నంతసేపూ ఏదో పట్టరాని ఆనందం, ఆ అమితానందంలో దాగి ఉన్న ఓ విధమైన భయం ఆవరించాయి.

ఒక గొప్ప ఆకర్షణీయమైన సౌందర్యరాశి సాన్నిధ్యంలో ఉన్నానని, ఆమె మనసు కూడా ఆకర్షణీయమైనదని గమనించాడు రవి. రవి వెలుపలిమంచి ఎలాంటి ప్రభావాన్నీ కోరే వ్యక్తి కాడు. అయినా అజీజ్ అందం, ఆకారం అతన్నలా కట్టబడేశాయి.

* * * *

అలనాటి మొగల్ వాస్తు కళకు ప్రతినిధిగా నిల్చి ఉన్న పెద్ద మేడ మహాద్వారం దాటి పోర్టికోలో ఆగింది కారు. అజీజ్ కారు దిగి "రవీ, ఇదే మా ఇల్లు" అన్నప్పుడు ఈ లోకంలోకి వచ్చాడు రవి.

"ఏమిటి పరధ్యానం?" అంది అజీజ్ పమిట సర్దుకుంటూ.

"పరధ్యానంకాదు. ఆలోచన" అన్నాడు రవి.

కారు దిగి ఇద్దరూ హాల్‌లోకి వచ్చారు.

"ముందు మా ఇల్లు చూడండి. ఈలోగా మావారు వస్తారు. వారితో పరిచయమయ్యాక నా స్టూడియోలోకి వెళ్దాము" అంది అజీజ్ ముగ్ధలా.

"నాకు మీ ఇల్లు చూడవలసిన అవసరం లేదనుకుంటాను" అన్నాడు రవి, అక్కడే కుండీలలో ఊగుతూన్న గులాబీలను చూస్తూ.

"మీరు మా అతిథులు. మేము మర్యాదగా చూపిస్తామన్నప్పుడు అలా తిరస్కరించడం నాగరకుల లక్షణం కాదనుకుంటాను" అంది అజీజ్, రవి సావాసంవలన ఏర్పడిన భాషాజ్ఞానంతో.

"నేను అతిథిని అనుకోండి. ఇవ్వాళ ఉండి రేపు పోయేవాణ్ణి. కనుకనే మీ ఇల్లు వివరంగా చూడవలసిన అవసరం నాకు లేదు. వివరా లెప్పుడూ విషాదానికే దారితీస్తాయి" అన్నాడు, అక్కడే ఉన్న సోఫాలో ఆసీనుడై ఎదురుగా టేబుల్‌పై ఉన్న "ఆర్ట్స్ అండ్ సివిలిజేషన్" అనే విదేశీ పత్రికను చూస్తూ.

"ఏదోనాగరకత అన్నావు. నేను మీ ఇంటికి ఒక కళాఖండాన్ని నిర్మించేటందుకు ఆహ్వానింపబడినాను కాని నాగరకత ప్రదర్శించి మర్యాద మన్ననలు పొందేటందుకు గాదు. నాగరకతకు, కళకు ఎక్కడా లంగ రందదు.అయినా,ఆ రెంటినీ కలిపి విదేశీయులు పత్రిక రూపాన విక్రయించి లాభాలు గడిస్తున్నారు. మనం అలవర్చుకున్న నాగరికత కూడా ఈ 'ఆర్ట్స్ అండ్ సివిలిజేషన్' నుంచి కొన్నదే" అంటూ ఆ పత్రిక తీసి పేజీలు తిరగేయ నారంభించాడు.


పొడుగు పెరగండి



సరిక్రొత్త దేహపరిశ్రమలు ఆహార నియమములు పాటించి, పొడుగు పెరిగి, ఆరోగ్యవంతులుగా ఉండండి. వివరములు ఉచితముగా పంపబడును.

TOTAL HEALTH FOR ALL
283, Azad Market (A. P. V.)
Delhi.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఉగాది నవలా పోటీలలో ప్రథమ, తృతీయ బహుమతులు పొందిన

'చక్రభ్రమణం'

రు. 5. 0 పోస్టేజి 50 న॥పై

రచన: కోడూరి కౌసల్యాదేవి.

'లోకంపోకడ'

రు. 5.00 పోస్టేజి 50 న॥పై

రచన: 'హరికిషన్'

బోడపాటి దమయంతి.

ముందుగా రు. 10.00 M.O. ద్వారా పంపినవారికి పై 2 పుస్తకాలు రిజిస్టర్ పోస్టులో పంపగలము.

ప్రచురణ కర్తలు

సర్వోదయా పబ్లిషర్సు

ఏలూరు రోడు — విజయవాడ—2.




"సులేఖ" మరియు "బ్రీఫ్‌మన్" ఫౌంటెన్‌పెన్‌లు

PENMEN'S INDUSTRIAL SERVICES
BOMBAY-67

''మిమ్మల్ని ముట్టుకుంటే అంటుకుంటారు. మీతో ఎవరు వేగేది? మీరు ఆపత్రిక చూస్తూ ఉండండి, నేను కాస్త బాత్‌రూమ్‌కువెళ్ళి...'' అంటూ వెళ్ళిపోయింది అజీజ్.

''ఆ పని నీవు ఆజ్ఞాపించకముందే చేస్తున్నాను'' అని సిగరెట్టు ముట్టించి అగ్గిపుల్ల ఎక్కడవేయాలో తెలియక హాల్ నలుమూలలా పరికించాడు రవి. ఎక్కడా ఆష్‌ట్రే కనిపించక పోయేవరకు బయటికి వచ్చి అగ్గిపుల్లతోబాటు సిగరెట్టు కూడా పారేసి, తిరిగి వచ్చి పత్రిక చూస్తూ కూర్చున్నాడు.

కారు హారన్ చప్పుడు విని అజీజ్ కారువద్దకు వెళ్ళి, భర్త తోడుగా రవి కూర్చున్న హాలులోకి వచ్చేవరకు, రవి లేచి ''నమస్తే అండి'' అన్నాడు వినయపూర్వకంగా.

''వీరేనండి, నేను తరచూ మీతో చెప్పే కళాకారుడు రవి. వీరు త్వరలోనే పారిస్ వెళ్ళనున్నారు'' అని తన భర్త నుద్దేశించి, ''వీరు నా..'' అనబోగానే అజీజ్ భర్తే మిగతాది పూర్తిచేశాడు.

ముగ్గురూ హాలులో ఆసీనులైనారు. దాసీది టీతెచ్చి ఇచ్చింది. టీ త్రాగుతూ, అజీజ్ భర్త తను ఆ రోజు కాంప్ కెళ్ళాలనే విషయం, అక్కడ అడవిలో తను చేయబోయే షికారు విషయం, అక్కడి అడవి జంతువుల గురించి, అడవి జాతుల మంత్రాలను గురించిన కట్టు కథలు వగైరా వివరించుతూంటే, రవి వింటూ మౌనంగా కూర్చున్నాడు. తన భర్త అసందర్భపు వాగుడు, రవి మౌనాన్ని గమనించిన అజీజ్ ''రవి చాలా మితభాషండి'' అంది భర్తవైపు చూస్తూ.

''ఎంత తక్కువ మాట్లాడితే అంతమంచిది'' అన్నాడు అజీజ్ భర్త, రవివైపు చూస్తూ.

''అదేమీలేదండి. ఎవరో ఒకరు ఎక్కువ మాట్లాడకపోతే ఇంకొకరి తక్కువకు విలువెక్కడిది చెప్పండి?'' అని అజీజ్‌వైపు చూశాడు రవి.

''అయితే నేనే వస్నమాట మాటకారిని'' అంది అజీజ్ లేనికోపం నటిస్తూ.

''ఇక్కడ మూగవారెవరూ లేరు. అంతా మాటకారులే'' అన్నాడు రవి తాపీగా.

రవి సమయస్ఫూర్తికి అజీజ్ భర్త అభినందన పూర్వకమైన నవ్వు నవ్వాడు.

అజీజ్ స్టూడియోలో అడుగు పెట్టటంతోనే రవి సిగరెట్టు వెలిగించి, ''మీ ఇంట్లో ఆష్‌ట్రే లేనట్టున్నదే?'' అన్నాడు.

''మావారు సిగరెట్ త్రాగరు'' అంది అజీజ్.

''మీవారు సిగరెటు త్రాగకపోవడానికీ, ఆష్‌ట్రే ఇంట్లో లేకపోవడానికి ఎక్కడాసంబంధం లేదు. అది గమనించకుండా మాట్లాడడం చాలా తేలిక'' అంటూ అక్కడే ఉన్న కలర్ మిక్సింగ్ డిష్‌ను ఆష్‌ట్రేగా వాడి, సిగరెటు పొగ గుప్పున వదులుతూ, గది నలుమూలలా పరికించాడు.

గదిలో ఆధునిక శిల్ప, చిత్రకళా రచనా పరికరాలన్నీ అమర్చి ఉన్నాయి. గదికి రెండు వైపుల ఉన్న కిటికీలకు పల్చని తెరలు అలంకరించి ఉన్నాయి. ప్రాతఃకాలపు పిల్ల తెమ్మెరలకు నీలితెరలు అలల్లా కదులుతున్నాయి. బయట తోటలోని రకరకాల పూలపరిమళాలన్నీ మిళితమై ఒకవిధమైన మైకంలాంటి మందసువాసన కిటికీ గుండా గదిలోకి వచ్చి, గదిలో ఉన్న రవిని మత్తెక్కింపజేసింది.

''నా స్టూడియో ఎలా ఉంది?'' అంది అజీజ్, రవి తన్మయతను గమనించి.

''నీవీ ప్రశ్నవేయకముందే నేను నీ స్టూడియో గురించి వ్యాఖ్యానిస్తే అందంగా ఉండేది'' అని అక్కడున్న ఈజెల్ వద్దకు వచ్చి దాన్ని పరిశీలిస్తూ నిలబడిపోయాడు రవి.

అజీజ్‌కు ఏం మాట్లాడాలో తెలియక ''మాటలు చాలించి పని ప్రారంభించండి'' అంది, రవి ఈజెల్‌ని గమనించే ధోరణిని తిలకిస్తూ.

''మాటల పర్యవసానమే పని అయినప్పుడు మాట్లాడక తప్పుతుందా?'' అన్నాడు రవి.

''బాబూ, మీతో నేను మాట్లాడలేను అని ఎన్నోసార్లు చెప్పాను'' అంది అజీజ్, ఏమీతోచక జడలోని గులాబిని తీసి మళ్ళీ యథాస్థానాన్నే అలంకరిస్తూ.

ఆమె పర్దే గులాబీని చూస్తూ ''అయినా అదే పని మళ్ళీ మళ్ళీ చేస్తున్నావు. తనకు తగదు అన్న పని జేయడంలోనే మానవునికి ఆనందం, తృప్తి. మానవనైజమే అంత. ఇందులో నీ దోషమేమి లేదు'' అన్నాడు రవి.

''మీకు తగని పని నేనేమీ చేయమనడం లేదు. కాని మీకు తగిన పనే చేయండి'' అంది అజీజ్ జెడను వెనక్కు వేసుకుంటూ.

''నన్నేమి చేయమంటావో చెప్పు'' అన్నాడు రవి.

''మా మహిళా మండలి ఆధ్వర్యాన జరుగబోయే కళా ప్రదర్శనానికి ఓ కళాఖండాన్ని సృష్టించండి'' అంది అజీజ్ దీర్ఘంగా.

''ఆదినరేకాని విషయం ఏమై ఉండాలో బోధపడటంలేదు'' అన్నాడు రవి.

''విషయం నేను చెప్పాక మీరు చేసేదేమిటి?''

''నిన్ను చెప్పమని నేను అనలేదు. అయినా, చెప్పడానికి, చేయడానికి చాలా తేడా ఉంది. చెప్పే వాండ్లంతా చేస్తారని నేను అనుకోను'' అన్నాడు రవి.

''అందరూ చేయలేకున్నా కొందరు చేస్తారు. నమ్ముతారా?'' అంది అజీజ్.

''ఆ కొందరిలో నీవున్నావనినమ్మమంటావా?'' అన్నాడు రవి, అజీజ్‌ను పరీక్షిస్తూ.

ఏం మాట్లాడాలో తెలియక ''మాటలేనా? అసలు విషయం ఆలోచిస్తారా?'' అంది అజీజ్.

''ఆలోచ నెప్పుడో వచ్చింది. కాని అవగాహన కావడంలేదు. విషయం 'అందం' అయితే ఎలా ఉంటుంది?'' అన్నాడు రవి, అజీజు ఆకారాన్ని పరీక్షిస్తూ.

అందం అనేమాట వినేవరకు ఆమె ఒళ్ళు జలదరించింది. అపాదమస్తకం తననుతానే పరీ


## మీ ముఖమే మీ అదృష్టం

మీ ముఖం మీది మొటిమలను, మచ్చలను తొలగించేందుకు ఇది ఒక ఉత్తమ మూలికా చికిత్స. వెల రు. 2/- లు మాత్రమే. వి. పి. పి. ఛార్జీలు అదనం. దిగువ అడ్రసుకు వ్రాయండి :

**SHIRLEY & CO.,**
**14, Sadayappadass Street,**
**Madras-11.**

## ప్రజాసాహిత్యపరిషత్తు

తెనాలి-2

ఉత్తమ ప్రచురణలు

| | | |
|---|---|---|
| మగువ మాంచాల | ఏటుకూరి | 2.50 |
| శిల్పకళా క్షేత్రాలు | కొండూరు | 3.25 |
| వెన్నెల రాత్రి | భాస్కరభట్ల | 3.00 |
| కార్తీక దీపాలు | శంకరమంచి | 2 00 |
| దారితప్పినమానవుడు | రమాదేవి | 3.75 |
| మధుపాత్ర | 'రవి' | 1-50 |
| పుత్రకామేష్టి | భరద్వాజ | 2-00 |
| ఆత్మగతం | ,, | 2 00 |
| అమాయికులు | రమేశ్ చౌదరి | 3 00 |
| భగ్నజీవులు | శార్వరి | 4-50 |




ఐటెక్స్

(కాటుక)

శాస్త్రీయంగా తయారైనది.

అరవింద్

బిందీ

కుంకుమ చాదు

6 ఆకర్షణీయమైన రంగులలో లభించుచున్నవి.

అరవింద్ లేబరేటరీస్

పి. బి. 1415, మద్రాసు-17.

తెలంగాణా జిల్లాలకూ హైదరాబాదుకూ మినహా ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు:

ప్రగతి ఏజెన్సీస్

పులిపాటివారి వీధి, విజయవాడ-1.

క్షించుకొని, పమిట సర్దుకొని, రవివైపు ఇది వరలా చూడలేక తలదించేసుకుంది అజీజ్.

"ఈ విషయం నీ కిష్టంలేదా?" అన్నాడు రవి, అజీజ్ మౌనం గమనించి.

"ఒకరి ఇష్టా యిష్టాలతో మీ పనికి సంబంధ మేమిటి?" అంది అజీజ్, తలవంచుకొనే.

"ఈ పని నీ ఇష్టప్రకారమే చేయబో తున్నాను గనుక."

"అయితే నేను చెప్పినట్లే చేస్తారన్నమాట."

"లేదు. నీవు చెప్పినట్టు నేనెప్పటికీ చేయను. కాని, నీ ఇష్టప్రకారం మాత్రం చేయగలను."

"అయితే నా కీ విషయం ఇష్టమే" అంది అజీజ్.

విషయానికి సరిపోను ఆర్మేచర్ వగైరా చేసేవరకు ఆరోజు గడిచిపోయింది. ఉదయం పదిగంటలకు "అందం" తాలూకు ఆర్మేచర్ వద్ద నిల్చుని పని ప్రారంభించాడు రవి. మధ్య మధ్య సిగరెట్టు పొగ ఊదుతూ ఏదో ఆలో చిస్తున్నాడు. ఈలోగా స్టూడియో తలుపులు తెరిచిన చప్పుడు విని తల అటువైపు త్రిప్పాడు. తలుపు తెరచుకొని స్టూడియోలో అడుగు బెట్టిన అజీజ్‌ను చూసి విస్తుపోయాడు రవి. ఆ విస్మయంలో చేతిలోని టూల్ జారిపోయింది గూడా గమనించలేదు. పల్చని పట్టు షెల్వారు, తెల్లని చూడీదారు పైజామా, నెత్తి తడిసి నందున ఆరేటందుకు వేసిన దూసుముడి, కాళ్లకు మఖ్మల్ స్లిప్పర్లు పచ్చని శరీరానికి ఈ వేషం అజీజ్ అందాన్ని ఇనుమడింపజేసినట్లుంది.

తలుపులు మూసి రవి దగ్గరగా వస్తూ "అలా కొత్తగా వింతగా చూస్తున్నారు నావైపు. మీ 'అందాన్ని' విడిచి?" అంది అజీజ్.

"కొత్తగా ఏమీకాదు గాని వింతగామాత్రం చూస్తున్నాను" అన్నాడు రవి అట్లాగే అజీజ్‌ను చూస్తూ.

"నాలో కనిపించే వింత ఏమిటో?" అంది అజీజ్ కుర్చీలో కూర్చుంటూ.

"అసలు ముస్లిం అందం ఆవేది ఈరోజు చూడగలుగుతున్నాను నీలో" అన్నాడు రవి.

"అందంలో కూడా హిందూ, ముస్లిం అనే తేడా ఉంటుందా రవిగారూ?" అంది అజీజ్ వింతగా చూస్తూ.

"తేడా ఏమోకాని, అసలు అందమనేది నా జీవితంలో ఎప్పుడూ వూహించడం తప్ప వాస్త వంగా కని ఎరుగను. నా కళాజీవితంలో ఎంతో మంది మోడల్స్‌ని చూశాను. కాని వాండ్లం దరిలో ఏదో డబ్బుతో కొన్న అందం తప్ప వాస్తవికమైన సౌందర్యం కనిపించలేదు. నిన్ను చూస్తుంటే అది పూర్తి అవుతుందా ఏమిటి అనిపిస్తున్నది?" అన్నాడు రవి.

"అందం తాలూకు వేదాంతం కట్టిపెట్టి మీ ఎదుట ఉన్న 'అందాన్ని' పూర్తిచేయండి. ప్రదర్శనా కాలం దగ్గరలోనే ఉంది" అంది అజీజ్.

"వేదాంతం మిళితంకాని కళ కళగాదు"

# మూసిన తలుపులు

అన్నాడు రవి.

"పని ప్రారంభించండి. లేకుంటే నేను వెళ్తాను" అంది అజీజ్, అలిగినదానిలా లేచి నిల్చుని.

వెంటనే ఆమె చేయిపట్టుకొని "అజీజ్, నీవు వెళ్లద్దు. నీవులేంది పని జరుగదు. నీవు ఇలా ఉన్నా జరుగదు" అన్నాడు రవి, ఆమె చేయి తన చేతిలో ఉన్నట్లు గమనించకుండానే.

అజీజ్ తన చేతిని జాగ్రతగా విదిలించు కుంటూ, "అయితే నన్నేమి చేయమంటారు? లేకుండా ఉండమంటారా?" అంది వ్యంగ్యంగా.

"అవును. అదే కావలసింది. నీవు ప్రస్తుతం అజీజ్‌గా గాక ఓ కళాకారునికి మోడల్‌గా వచ్చి ఆ ఈజెల్‌పై నిల్చోవాలి. నీ విక్కడ లేవనుకొనే ఉండాలి. నీ సౌందర్యాన్నే ఈ 'అందం' లోకి మల్చాలి. ఈ శిల్పం చూశాకే అందమంటే ఏమిటో ప్రపంచానికి తెలిసిరావాలి. నీవు దీనికి అంగీకరించక తప్పదు" అన్నాడు రవి ఉద్రేక పూర్వకంగా.

అనుకోకుండా ఏర్పడిన ఈ వైపరీత్యానికి అజీజ్‌కు ఏం మాట్లాడాలో, ఏంచేయాలో బోధపడలేదు. అంతా అగమ్యగోచరంగా ఉంది ఆమెకు. అందుకే నిశ్చలంగా పాలరాతి విగ్రహంలా నిల్చుండిపోయింది.

"ఈ 'అందం' అనే శిల్పాన్ని సృష్టించే టందుకు పురికొల్పింది నీవు. నీ అందాన్నే మల్చ మంటుంది ఈ కళ. నే నూహించే అందం నీ అందంముందు దిగదుడుపు అవుతూంటే నేనేమి చేసేది?" అన్నాడు రవి.



పతనాసక్తి

చిత్రం—వెల్లటూరి పూర్ణానందశర్మ (వెల్లటూరు)

అజీజ్ యథాప్రకారం మౌనంగా నిల్చుని ఉంది. ఆమె నోటినుండి మాట పెగలటంలేదు. అజీజ్ మౌనాన్ని గమనించి, "మోడల్‌గా నిల్చోవా లంటే సిగ్గనిపిస్తూందా? చిత్రకారిణివి, కళా హృదయంగలదానివి, నీవే వివస్త్రగా నిలబడే టందుకు ఇంత సంకుచిత దృష్టితో అభిమాన పడితే, రేపు ఈ నగ్న సౌందర్యశిల్పాన్ని మామూలు ప్రజానీకం ఏ దృష్టితో చూస్తారో, ఎలా పరిగణిస్తారో నే నూహించలేను. అలాంటి దృష్టి మోడల్‌గా నిలబడబోయే నీకే ఉంటే ఇహ ఈ 'అందం' అనే కళాసృష్టి అనవసరం" అన్నాడు రవి గంభీరంగా.

అజీజ్ ఫైన్ ఆర్ట్సు కాలేజీలో డిప్లొమా పొందింది. కళను కేవలం సరదాకు నేర్చినా, లలిత కళలంటే, కళాకారులంటే ఎక్కడలేని ఆప్యా యత కనపర్చుతుంది. కళ నభ్యసించేటప్పుడు తనముందు ఎంతోమంది మోడల్స్ (స్త్రీలు, పురుషులు) నగ్నంగా వివిధ భంగిమలలో నిల్చు న్నారు. అప్పుడు తనకు కళాదృష్టి తప్ప ఇంకె లాంటి దృష్టీ ఏర్పడలేదు. నగ్నత గురించి చర్చ వచ్చినప్పుడు 'కళాదృష్టితో ఎవరైనా నిలబడ వచ్చు'నని తోటి విద్యార్థులతో ఎన్నోసార్లు వాదించింది. 'న్యూడిజమ్' మీద వాదాలలో తను చేసిన ప్రసంగానికి బహుమతి గూడా లభించింది. కాని ఈ రోజు వివస్త్ర అయి రవి ముందు మోడల్‌గా నిల్చోవాలంటే ఏదోభిడియం, సిగ్గు, అన్నిటికి మిన్నగా వణుకు ఆవేశించాయి. ఏదైనా తమదాకావస్తేనే తెలుస్తుందేమో మాన వులకు! ఇలాంటి విపత్తు సంభవిస్తున్నదని కలలో గూడా ఊహించి ఉండదు అజీజ్.

గదినిండా ఆధునిక కళారచన పరికరాలన్నీ బావురుమన్నట్లున్నాయి. వాటి మధ్య ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉన్నా, గదిని నిశ్శబ్దం ఆవ రించింది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చే నిట్టూర్పు విడిచి, వివస్త్ర అయి ఈజెల్‌పై నిల్చుని, "ఏ భంగిమలో నిల్చోమంటారో చెప్పండి" అంది అజీజ్.

రవి ఆమె దగ్గరగా వెళ్లి తను ఊహించిన భంగిమలో నిల్చోబెట్టి, 'అందం' అనే కళా సృష్టి కుపక్రమించాడు.

* * * *

శిల్పం పూర్తి అయింది. డివైడర్, పాప్ లైన్‌తో ఆఖరుగా తన 'అందం'తో పోల్చి చూస్తూంటే, ప్రపంచంలో ఏ కళాకారునికీ లభించని మోడల్ తనకు లభించిందనే గర్వం ఏర్పడింది రవిలో. శిల్పం పూర్తి అయినా ఆమె అలానే నగ్నంగా ఎల్లప్పుడూ తన ఎదుట నిల్చుంటే బాగుండు ననే ఆలోచనలో చేతిలోని డివైడర్ జారి అజీజ్ బుగ్గపై గుచ్చుకుంది. వెంటనే తన పరధ్యానానికి సిగ్గుపడి "బలంగా గుచ్చు కుందా?" అన్నాడు.

"అంత బలంగా ఏమీలేదు కాని మీ 'అందం' పూర్తి అయినట్లేనా?" అంది అజీజ్.

"ఆ. అయిపోయింది. ఇక నీవు వస్త్రధారిణి కావచ్చు" అన్నాడు రవి, చేతిలోని పరికరాలు అక్కడ పెడుతూ. అజీజ్ వస్త్రధారిణి అయి అద్దంముందు నిలబడేవరకు, అప్రయత్నంగా ఆమె చేయి ఎడమ బుగ్గమీదికి వెళ్లి, అక్కడేర్పడిన మచ్చను స్పృశించింది. అనుకోకుండా ఆమె పెదిమలపై ఓ హాసరేఖ ఏర్పడిపోయింది. వెంటనే శిల్పంవద్దకు వచ్చి చూసేవరకు శిల్పానికి కూడా మచ్చ చూసి ఆశ్చర్యంగా రవివైపు చూసింది.

రవి కుర్చీలో కూర్చుని తాపీగా సిగరెట్టు పొగ వదులుతూ, "బాహ్యాలంకరణతో మానవుని అసలు అందం మరుగుబడిపోతుంది. అందుకే అందాలపోటీలో అలంకారాన్ని నిషేధిస్తారు" అన్నాడు అజీజ్ అలంకారాన్ని చూస్తూ.

"అయితే మానవులందరిని ఎల్లప్పుడూ నగ్నంగా ఉండమంటారా?" అంది అజీజ్, తన దుస్తులను సర్దుకుంటూ.

"నగ్నంగా ఉండమనను కాని నగ్నతని అసహ్యించుకోవటం మాని దాన్ని చిత్తశుద్ధితో ఆరాధించాలి. ఆనాడే ప్రతిమానవుని హృదయం నిష్కల్మషమై కళాదృష్టి ఏర్పడుతుంది. నగ్న సౌందర్యం గురించి ఎంత చెప్పినా మనకు అర్థం గాదు. పైగా చెప్పేవాడిని పిచ్చివానిక్రింద జమ గడుతాము. నగ్న సౌందర్యాన్ని ఆరాధించేవారు మానవాతీతులై ఉండాలి. నగ్నతలోని అందం అందరికీ అర్థంకానిది. అది అర్థమైననాడు మానవులంతా దేవతలుగా మారుతారు. కాని అదెన్నటికీ జరగని విషయం అజీజ్. అదెన్నటికీ జరగని విషయం" అన్నాడు రవి ఆవేదనా పూరితంగా.

"మానవులను మానవులుగానే ఉండనీయండి" అని, శిల్పాన్ని స్పృశిస్తూ చూస్తూ అంది అజీజ్. తమ ప్రతిరూపాన్ని చూస్తుంటే మానవులకు అంతులేని ఆనందం కలుగుతుంది.

"అజీజ్, ఇక నేను వెళ్తాను" అన్నాడు రవి సిగరెట్టు వెలిగించి గట్టిగా దమ్ము లాగుతూ.

వెంటనే బయట కారు హారన్ చప్పుడు విని "ఉండండి. మావారు ఈ శిల్పాన్ని చూశాక వారి ప్రశంసలు తీసుకొని వెళ్దురు గాని" అని పోర్టికోలోకి వెళ్లింది అజీజ్. రవి స్టూడియో నుండి బయటికి వెళ్లి వరండాలో సిగరెట్టు త్రాగుతూ నిల్చున్నాడు.

పతి సమేతంగా స్టూడియోకు వచ్చి "ఇదే నండి రవిగారు చేసిన శిల్పం" అని రవివైపు చూసింది అజీజ్.

గదిమధ్య అజీజ్ నగ్న విగ్రహాన్ని చూసి అజీజ్ భర్త నిశ్చేష్టుడయ్యాడు.అడుగుముందుకు పడలేకపోయింది. విగ్రహాన్ని చూసినకొద్దీ నగ్నంగా నిల్చున్న తన భార్యను ప్రదర్శనంలోని జనమంతా తడిమి చూస్తున్నట్టు, అందమైన తన భార్య ప్రతి అవయవాన్ని ప్రేక్షకులలోని ప్రతివాడూ స్పృశిస్తూ ఆనందిస్తున్నట్టు, ప్రేక్షకుల ఆనందంలోని 'అహంకారాలు' తన చెవుల్లోకి దూరి తల దిమ్మెక్కిన వానిలా "అజీజ్" అని బిగ్గరగా అరిచాడు, ప్రక్కనే ఆమె నిలబడిన విషయమే మరిచి. అజీజ్ త్రుళ్లిపడి "ఏమండీ?" అంది.

"విగ్రహానికి బట్టలు వేయమను" అన్నాడు అజీజ్ భర్త, ఇంకా ఏమూలో దాగి ఉన్న ఓపికను బిగబడుతూ.

"ఈ శిల్పానికి బట్టలు వేస్తే అందులో కళ ఏమీమిగలకుండా పోయి సాధారణపు బొమ్మ అవుతుంది. అది అలాగే ఉంటే ప్రదర్శనలో రాణిస్తుంది" అంది అజీజ్ వేడుకగా.

"అలా అయితే ఈ విగ్రహం ఈ రూము నుంచి ఒక్క అడుగు కూడా కదిలే వీలులేదు" అన్నాడు శాసించే ధోరణిలో.

"ఆ కళని నిర్మించింది ప్రదర్శనానికని" అంది అజీజ్, ముక్తసరిగా.

"దాన్ని ప్రదర్శనానికి పంపేకన్న నీవే వెళ్లి ప్రదర్శనంలో నిలబడు నగ్నంగా" అంటూ నగ్నతపై మానవలోకానికున్న అక్కసు నంతా ఆ నగ్నశిల్పంపై చూపాడు.

'అందం' క్రిందబడి చెదిరిపోయింది. భర్త ప్రవర్తనకు అజీజ్ నిశ్చేష్టురాలైంది. ఒక్క అంగలో భర్తను సమీపించి ముక్కలైన 'అందాన్ని' చూస్తూ, "మీరు పగులగొట్టింది శిల్పాన్ని కాదు; నా హృదయాన్ని. నా ఆత్మ స్థైర్యానికి నిదర్శనంగానే ఈ 'అందం' నిర్మింపబడింది. ఈ అందమే లేనప్పుడు మీ అజీజ్ గూడా లేదు" అని వెంటనే తన బట్టలు విప్పేసి ముక్కలైన 'అందం' స్థానే నగ్నంగా పాలరాతి విగ్రహంలా నిలబడింది. కొండలు దిగివెళ్లిపోతున్న రవి తన కెదురుగా ఉన్న కిటికీగుండా కనిపించి, "నగ్నతని అర్థంజేసుకున్ననాడు మానవులంతాదేవతలౌతారు" అన్న అతని మాటలు గదినిండా సుడులు తిరుగుతున్నట్లనిపించింది.

అజీజ్ ప్రవర్తనకు ఆమె భర్త దిగ్భ్రాంతుడై, భార్య దిగంబరత్వాన్ని చూడలేక, దభీమని స్టూడియో తలుపులు మూశాడు. ఆ 'మూసిన తలుపులు' ఏ యుగానికి తెరుచుకుంటాయో తెలియదు. ★


## తైలవర్ణ చిత్రములు

ప్రసిద్ధ చిత్రకారునిచే వ్రాయబడిన పండిట్ నెహ్రూ, డాక్టర్ రాధాకృష్ణన్ గారల తైలవర్ణ చిత్రములు. అత్యంత ఆకర్షవంతమైన రంగుల ముద్రణ. సైజు 20"×14" ప్రతి ఇంటిలోను, సంస్థలోను వుండవలసిన మన ప్రియతమ నాయకుల అపూర్వమైన చిత్రములు. వ్యాపారులకు చక్కని అవకాశం. కేరళ గవర్నర్ శ్రీ వి. వి. గిరి, కేంద్రమంత్రి శ్రీమతి లక్ష్మీమీనన్, హిందూపత్రిక మొ.వారి ప్రశంసలందినవి. ఒక్కొక్కటి రు. 2—00. నేడే ఎం. ఒ. చేయండి.

ఆంధ్రప్రదేశ్‌కు సోల్ ఏజంట్:—

**N. RAMA SUBBA RAO,**
**Export Agent,**
**Dhone (Post), Kurnool Dist.**

**నెల 1 కి రు. 300 -లు సంపాదించండి**
**బొమ్మలతో ట్రాన్సిస్టర్ రేడియో గైడు**

మరమ్మతులకు సాయపడుటకు లేక సులభ పద్ధతులతో సెల్సుతో పనిచేయగల పోర్టబుల్ నిప్పుపెట్టె సైజు పాకెట్ ట్రాన్సిస్టర్ మరియు టేబిల్ మోడల్ ట్రాన్సిస్టర్ రేడియోను 30/-తో స్వంతంగా తయారు చేసికొనుటకు అనువైన పూర్తిగైడు ఖరీదు రు. 4/—, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ రు. 4/—, పాటరన్ల, పువ్వుల, సీన్ల వగైరా సెలెక్టు చేయబడిన 250 డిజైన్లు గల ఎంబ్రాయిడరీ డిజైను పుస్తకం రు. 5/—100 బొమ్మలతో వివాహ జీవితం రు. 5/— ప్రతి పుస్తకానికి పోస్టేజి రు. 1/— అదనము.

**VANDANA BOOK DEPOT (AMT)**
**Rafatganj, Aligarh (U.P.)**



## ప్రెసిడెంట్ & పగోడా తయారీకలు

పెడిటబుల్ హెయిరాయిల్, సోప్, టాల్కమ్ పౌడర్, పర్‌ఫ్యూమ్స్ క్యాస్ట్రాయిల్ & పరిమళ ద్రవ్యములు.

బహుమానము

# ఉచితము

మీరు కొనే ఒక్కొక్క ప్రెసిడెంట్ & పగోడా తయారీకలతో ఒక్కొక్క అందమైన 1963 ఆఫ్‌సెట్ పలువర్ణములతో కూడిన క్యాలండర్ బహుమానముగా ఇవ్వబడును. 10 రకములైన సుందరమైన క్యాలండర్లు కలవు. వానిలో మీరు ఇష్టపడే ఏ క్యాలండర్‌నైనను ఎన్నుకొనవచ్చును.

శ్రీ రథోడ్ ట్రేడింగ్ కంపెనీ మద్రాసు-1.

SP-RTC-4